సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 13 । జూన్ । 2023



## శివోహం

వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా కుటుంబ సభ్యులతో తరలివచ్చారు.



## జీవో వచ్చినా.. జీతం పెరగలె!

మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారు. అరకొర వసతులతో విద్యార్థులకు వండి పెడుతున్నా కనీస వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
39.0/30.0

## వాతావరణం

పగలంతా ఎండగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీచే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### బాలలతో పని చేయించడం నేరం



మాట్లాడుతున్న జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: బాలలకు ఉచిత నిర్బంధ విద్య అందిచేలా చట్టాలున్నాయని, అందుకు విరుద్ధంగా బాలలతో పనులు చేయిస్తే చట్టప్రకారం నేరమని జిల్లా జడ్జి హేమంత్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలో సోమవారం ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పిల్లలను బడికి పంపి, పెద్దలంతా పనులకు వెళ్లాలని సూచించారు. పిల్లలతో పనులు చేయించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు సమాజంలో ప్రతిపౌరుడు తమవంతు సహకారం అందించాలన్నారు. బాలకార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే 1098 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారమందిస్తే సంబంధిత అధికారులు రంగప్రవేశం చేసి తగు చర్యలు తీసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, కోఆర్డినేటర్ ఉమాదేవి, సభ్యురాలు సుమలత, న్యాయవాదులు, వ్యాపారులు పాల్గొన్నారు.

### ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించండి



అడిషనల్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న బాధితులు

పెద్దపల్లిరూరల్: ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని రామగుండం మండలం లింగాపురం ఎస్సీకాలనీ వాసులు కోరారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి విన్నవించారు. ఓసీపీ–4 ప్రాజెక్టుతో కాలనీలో ఇండ్లు కూలి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వస్తుందని అధికారులు చెబుతున్నారే తప్ప ఆచరణలో అమలు చేయడం లేదని ఇరికిల్ల శంకరయ్య, పద్మ అన్నారు. వీలైనంత త్వరగా ప్యాకేజీ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మల్లేశ్, బుచ్చమ్మ, రాజమ్మ, లక్ష్మి, నాగజ్యోతి, తిరుపతి, తిరుపతమ్మ, చరణ్ తదితరులున్నారు.

### స్పోర్ట్స్ ఫెస్ట్‌లో సత్తాచాటిన జేఎన్‌టీయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కమాన్‌పూర్(మంథని): కరీంగనర్ జిల్లా హుజురాబాద్‌లోని కిట్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను పురష్కరించుకొని నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇంజినీరింగ్ కళాశాల స్పోర్ట్స్ ఫెస్ట్‌లో మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఫెస్ట్‌లో బాస్కెట్‌బాల్, వాలీబాల్ పోటీలు నిర్వహించగా మంథని, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిట్ కళాశాలలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. మంథని జేఎన్‌టీయూ కళాశాల బాలికలు బాస్కెట్‌బాల్, వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, నిత్యం ప్రాక్టీస్ చేస్తూ పోటీల్లో విజేతలుగా నిలవాలని సూచించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### సుల్తాన్‌పూర్ సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న విజయ్‌రావు

ఎలిగేడు(పెద్దపల్లి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామాన్ని సోమవారం రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ ఎస్ఎన్ విజయ్‌రావు సందర్శించారు. ఈనెల 15న జరిగే పల్లెప్రగతి దినోత్సవం సందర్భంగా చేసే ఏర్పాట్లను పరిశీలించారు. పల్లెప్రగతి సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు, నాడు– నేడు ఫ్లెక్సీలతో పాటో ప్రదర్శన చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఎంపీవో అనిల్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అఫ్సర్, పంచాయతీ కార్యదర్శి వినోద్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తర'గతి' మారలె



### విద్యార్థులే కూలీలు

ఇది పెద్దపల్లి పట్టణంలోని కమాన్‌వాడ (సుభాష్ విగ్రహం వద్ద) పాఠశాల. స్కావెంజర్స్, అటెండర్స్ లేకపోవడంతో విద్యార్థులే కూలీ అవతారం ఎత్తి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈస్కూల్‌ను మన ఊరు–మన బడి కింద ఎంపిక చేయగా, పనులు అసంపూర్తిగానే మిగిలాయి. మౌలిక వసతులలేమితో విద్యార్థులు తొలిరోజు పాఠాలు వినాల్సిన పరిస్థితి నెలకొంది.



### పునాదికే పరిమితం

ఈ ఫొటో ఎలిగేడు మండలం ధూళికట్ట జెడ్పీ పాఠశాల. మన ఊరు – మన బడి కింద పనులు చేపట్టగా పునాదులు దాటలేదు. వేసవిలో నిర్మాణం పూర్తిచేయకపోవడంతో ఇసుక, మట్టితో నిండిపోయింది.



### అసంపూర్తి పనులు

ఈచిత్రంలో కనిపిస్తున్నది కమాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న మన ఊరు–మన బడి పనులు. జెడ్పీహెచ్ఎస్‌తోపాటు ప్రాథమిక, ఉర్దూ మీడియం పాఠశాలలను రూ.49లక్షల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. ఫిబ్రవరిలో గదుల రిపేరు, డైనింగ్ హాల్‌నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు చేయడానికి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినా నేటికీ పూర్తికాలేదు.



పెద్దపల్లి బాలుర పాఠశాలలో కొనసాగుతున్న నిర్మాణ పనులు

- మొదటి రోజు తప్పని అవస్థలు
- ఎండల కారణంగా తొలిరోజు హాజరు అంతంతే
- పలు పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ

సాక్షి, పెద్దపల్లి: విద్యార్థుల ఆశలు, ఆకాంక్షల మధ్య కొత్త విద్యాసంవత్సరం సోమవారం వేడుకగా పునఃప్రారంభమైంది. తొలిరోజు పిల్లలు ఎండ తీవ్రతతో పాఠశాలలకు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. ఎప్పటిలాగే సర్కారు బడులు సమస్యలతోనే స్వాగతం పలికాయి. తొలిరోజునే పలు పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందించారు. ఉపాధ్యాయులు బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేసుకున్నారు. సోమవారం 'సాక్షి' బృందం జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలలను పరిశీలించింది. గతం మాదిరగానే ఈసారి మౌలిక వసతుల కొరత విద్యార్థులను వెక్కిరిస్తున్నాయి. అసంపూర్తిగా భవనాలు, చీకటి గదులు, తిరగని ఫ్యాన్లు, విరిగిన తలుపులు, కానరాని నీటివసతి, నిరుపయోగంగా మరుగుదొడ్లు, తదితర సమస్యలలో ఈ ఏడాదైనా పరిస్థితి మెరుగుపడుతుందని ఆశించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు నిరాశే ఎదురవుతుంది.

**స్కావెంజర్లు లేక..**

గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని పాఠశాలల్లో పారిశుధ్య పనులను పారిశుధ్య సిబ్బందికి అప్పగించారు. కాగా ఇప్పటికే పనికి సరిపడు పారిశుధ్య కార్మికులు లేక గ్రామాలు, డివిజన్లలో చెత్తాచెదారం పేరుకుపోతుండగా అదనంగా పాఠశాలల్లో పనులు అప్పగించడంతో ఏదో మొక్కుబడిగా ఆదివారం పాఠశాలలను శుభ్రపరిచారు. దీంతో చాలా బడుల్లో టాయిలెట్స్ నుంచి దుర్వాసన వెదజల్లుతుండగా, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పలుచోట్ల విద్యార్థులే బడులను శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**ముందుకుసాగని మన ఊరు–మన బడి**

కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం మనఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లావ్యాప్తంగా ఎంపికైన పాఠశాలల్లో ప్రతిపాదనలు, అంచనాలు, పరిశీలనలు, ఆమోదం వంటి వాటికే ఎక్కువ సమయం తీసుకుంది. చాలా చోట్ల పనులు ప్రారంభమైనా వేగంగా జరగడం లేదు. జిల్లాలో 543 పాఠశాలలుండగా, మన ఊరు–మన బడి కింద తొలివిడత 191 పాఠశాలలను ఎంపిక చేసి, 175 స్కూళ్లలో పనులు ప్రారంభించారు. ఇందులో 17 స్కూళ్లలో పనులు పూర్తిచేసుకొని ప్రారంభోత్సవానికి అందుబాటులోకి రాగా, మరో 23పాఠశాలలు పనులు పూర్తిచేసుకొని ఈనెల 20న ప్రారంభోత్సవాలు జరుపుకోనున్నాయి. అయితే మనఊరు– మన బడి కింద ఎంపికైన స్కూళ్లలో అభివృద్ధి పనులు ఇలా అసంపూర్తిగా ఉంటే, మిగిలిన పాఠశాలల్లో సమస్యలు ఎక్కడివక్కడే అన్నట్లుగా వెక్కిరిస్తున్నాయి. పనుల పురోగతిపై డీఈవోను వివరణ కోరగా 'మన ఊరు– మన బడి కింద చేపట్టిన పనులు కొంత ఆలస్యంగా కొనసాగుతున్నాయి. సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకవస్తాం' అని తెలిపారు.

### ఒక విద్యార్థి.. ఇద్దరు ఉపాధ్యాయులు



రామగుండం ఒకటో డివిజన్ పాములపేట ప్రాథమిక పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఒకే విద్యార్థి మిగలడం చర్చనీయాంశమైంది. గత విద్యా సంవత్సరంలో నలుగురు విద్యార్థులుండగా ముగ్గురిని తల్లిదండ్రులు వేరే పాఠశాలలకు పంపించారు. దీంతో ఒక విద్యార్థికి ఇద్దరు ఉపాధ్యాయులు కాపలాగా కూర్చున్నారు. కాగా ఒంటరిగా ఉన్న విద్యార్థికి తోడుగా తల్లి గంటన్నర పాటు కూర్చొని వెళ్లిపోయిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామంలో బడిబాట నిర్వహించినా ఎలాంటి ఫలితం లేకపోగా ఒకే విద్యార్థి మిగలడంపై ఉపాధ్యాయులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

**పెర్కపల్లిలో..**

ధర్మారం మండలం పెర్కపల్లి జెడ్పీ స్కూల్‌లో 24 మంది విద్యార్థులుండగా సోమవారం ఆరుగురు హాజరైనారు. ఈ పాఠశాలలో 8 మంది ఉపాధ్యాయులుండగా ఇటీవల నలుగురు బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లారు. ఈ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో బడిబాట ద్వారా అడ్మిషన్‌లు పెంచాలనే ప్రయత్నాలు విఫలమైనాయి. బడిబాట ద్వారా మండల వ్యాప్తంగా 308 మంది విద్యార్థులను గుర్తించగా పాఠశాల ప్రారంభం రోజు కేవలం 8 మంది మాత్రమే అడ్మిషన్ తీసుకున్నారు. ఓదెల మండలం గుంపుల హైస్కూలు ప్రారంభమైనా 19 మంది విద్యార్థులకు ఎవరూ హాజరుకాలేదు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సెల్‌ఫోన్‌తో తల్లితండ్రులకు ఫోన్‌చేయగా కేవలం ఐదుగురు హాజరయ్యారు.



### నిర్వహణ లేక

ఇది రామగుండం కార్పొరేషన్ పరిధి విఠల్‌నగర్ పాఠశాలోని మరుగుదొడ్డి. ఈ స్కూల్‌ను మన ఊరు– మన బడి కింద ఎంపిక చేసి అభివృద్ధి చేశారు. స్కావెంజర్స్ లేకపోవడంతో మరుగుదొడ్డి అపరిశుభ్రంగా మారి కంపుకొడుతోంది. దీంతో విద్యార్థులు టాయిలెట్‌కు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని చాలా పాఠశాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

## ఈవీఎంల పనితీరుపై అపోహలు వద్దు

- కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై ఎలాంటి అపోహలుండొద్దని, ఫస్ట్ లెవల్ చెకింగ్ సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏమైనా అనుమానాలుంటే అప్పటికప్పుడే నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సంగీత అన్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో సోమవారం ఫస్ట్‌లెవల్ చెకింగ్ (ఎఫ్ఎస్ఎల్) కార్యక్రమాన్ని కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈసీఐఎల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో ఎఫ్ఎస్ఎల్ నిర్వహిస్తామన్నారు. 15మంది ఇంజినీర్ల బృందం తనిఖీలు చేస్తారని పేర్కొన్నారు. 1,509 బ్యాలెట్ యూనిట్, 1,179 కంట్రోల్ యూనిట్, 1270 వీవీప్యాట్‌ల ఫస్ట్‌లెవల్ చెకింగ్ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో చేస్తామని వివరించారు. 15మంది ఇంజినీర్లతో పాటు 40 మంది వీఆర్ఏలు, 30 మంది డీటీలు, ఎక్స్‌టెన్షన్ అధికారులు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఎల్ చెకింగ్‌ను వీడియో కెమెరాలో రికార్డు చేయిస్తున్నామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటమాధవరావు, ఈడీఎం కవిత, ఎలక్షన్ డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.



ఈవీఎంలు భద్రపర్చిన గోదాం వద్ద కలెక్టర్ సంగీత, అధికారులు

## ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు పెంచాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, నోట్‌బుక్స్, బుక్స్‌తో కార్పొరేట్ స్థాయిలో విద్యాభ్యాసం చేస్తున్నామని, కార్పొరేట్ స్కూళ్లలో లేని క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని వివరించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. పదవ తరగతిలో కార్పొరేట్ కంటే అత్యధికంగా 10 జీపీఏలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికి వచ్చాయని, అది విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ఎక్కువ మంది ప్రభుత్వ స్కూళ్లలో చేర్చేలా విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి విజయకుమార్, ఎంఈవో సురేందర్, మండల నోడల్ ఆఫీసర్ శశికాంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో మాధవి

## ఫిట్‌నెస్ లేని స్కూల్‌బస్సులపై కఠిన చర్యలు

- డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్



మాట్లాడుతున్న చంద్రశేఖర్ గౌడ్

తిమ్మాపూర్: పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులను తరలించే వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,629 విద్యాసంస్థల బస్సులు ఉండగా ఇప్పటివరకు కేవలం 817 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని తెలిపారు. మిగిలిన 812 బస్సులు కూడా సంబంధిత రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. 15 ఏళ్లు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిప్పొద్దని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆ వాహనాలను సీజ్ చేస్తామని, యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లాలో 818బస్సులకు 468, పెద్దపల్లి జిల్లాలో 249బస్సులకు 75, జగిత్యాల జిల్లాలో 427బస్సులకు 213, రాజన్న సిరిసిల్లలో 135 బస్సులకు 61బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయని వివరించారు. మిగిలిన బస్సులు కూడా త్వరలో ఫిట్‌నెస్ చేసుకోవాలని తెలిపారు. త్వరలో యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశం నిర్వహిస్తామని డీటీసీ తెలిపారు.

## యువత శారీరక ధృఢత్వంపై దృష్టి సారించాలి

- 2కే రన్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ





పెద్దపల్లిలో నిర్వహించిన 2కే రన్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, యువత, ప్రజాప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉండగలుగుతామని, యువత శారీరక దృఢత్వం కోసం వ్యాయామాలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రభుత్వ ఐటీఐ ఆవరణ నుంచి ప్రగతినగర్, అమర్‌నగర్, మేన్‌రోడ్, జెండా, కమాన్ మీదుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు నిర్వహించిన 2కే రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా యువతను భాగస్వాములను చేస్తూ పోలీసుశాఖ చేపట్టిన 2కే రన్ విజయవంతమైందన్నారు. హెల్తీ బాడీ ఉంటేనే హెల్తీమైండ్ ఉంటుందని, యువత శరీర దృఢత్వంతోనే ఆరోగ్యంగా ఉండగలుగుతామని గుర్తించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ ఎడ్ల మహేశ్, మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, సీఐ ప్రదీప్, ఎస్ఐ మహేందర్, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

మంథని: యువత మంచిని ఎంచుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సూచించారు. మంథనిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బొక్కల వాగు వంతెన నుంచి స్థానిక జూనియర్ కళాశాల మైదానం వరకు 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. తల్లితండ్రుల ఆశయాలు నెరవేర్చేలా యువత ముందడుగు వేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ, యువత బాగా చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. 2కే రన్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సీఐ సతీష్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాణివర్మ, మంథని, ముత్తారం, రామగిరి ఎంపీపీలు కొండ శంకర్, జక్కుల ముత్తయ్య, అరెల్లి దేవక్క, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంథనిలో 2కే రన్ ప్రారంభిస్తున్న మధు

### నేరరహిత తెలంగాణే లక్ష్యం



2కేరన్‌లో ఎమ్మెల్యే చందర్, పోలీసులు

గోదావరిఖని(రామగుండం): నేరరహిత తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. గోదావరిఖని సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 2కేరన్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు రన్ నిర్వహించారు. ఏఆర్ ఏసీపీ సుందర్ రావు, సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు, వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## మా భూములు మాకే కావాలి

పాలకుర్తి(రామగుండం): మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 746, 747లో తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామ దళితులు ఆందోళన నిర్వహించారు. సంబంధిత సర్వేనెంబర్‌లో కొంతమంది నిర్మాణాలు చేపడుతున్నారనే సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన తహసీల్దార్ సునీతతో దళితులు వాగ్వాదం చేశారు. దాదాపు 40 ఏళ్లుగా కాస్తులో ఉన్న తమను కాదని ఇతరులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని ఆందోళన చేశారు. తమ భూముల్లో ఇళ్లు నిర్మించుకుంటామని, ఈ విషయంలో ఎలాంటి త్యాగానికైనా సిద్ధమేనని తేల్చి చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బసంత్‌నగర్ పోలీసులు చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. సర్వేనంబర్ 746, 747లో 7ఎకరాల 6గుంటల భూమిలో 4ఎకరాల్లో అర్హులకు 75చదరపు గజాల చొప్పున 70 మందికి పట్టాలు పంపిణీ చేశామని, ఇదంతా నిబంధనల ప్రకారమే చేశామని తహసీల్దార్ వివరించారు. అయితే పట్టాలు పొందిన వారిలో ఉద్యోగులు, భూస్వాములు ఉన్నారని దళితులు ఆరోపించారు. అనర్హులు ఉంటే ఆధారాలతో తమకు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ సూచించారు.



తహసీల్దార్‌కు పత్రాలు చూపిస్తున్న దళితులు

# జీవో వచ్చినా.. జీతం పెరగలె!

- సమస్యల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- నెలంతా పనిచేస్తే ఇచ్చేది రూ.వెయ్యి మాత్రమే
- ధరలకు అనుగుణంగా పెరగని బడ్జెట్

**మధ్యాహ్న భోజనం మెనూ..**

| | |
|---|---|
| సోమవారం | : కిచిడీ మిక్స్‌డ్ వెజిటేబుల్, గుడ్డు, |
| మంగళవారం | : రైస్, సాంబారు, మిక్స్‌డ్ విజిటేబుల్ కర్రీ |
| బుధవారం | : రైస్, ఆకుకూరల పప్పు, మిక్స్‌డ్ విజిటేబుల్ కర్రీ, గుడ్డు |
| గురువారం | : వెజిటేబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ విజిటేబుల్ కర్రీ |
| శుక్రవారం | : రైస్, సాంబారు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ, గుడ్డు |
| శనివారం | : రైస్, సాంబారు |


మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కార్మికురాలు

**సుల్తానాబాద్(పెద్దపల్లి):** మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారు. అరకొర వసతులతో అష్టకష్టాలు పడుతూ విద్యార్థులకు వండి పెడుతున్నా తమకు కనీస వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని గతంలో 45 రోజుల పాటు ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. అప్పుడు సీఎం కేసీఆర్ స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం నెలకు రూ.3వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. 2022 ఫిబ్రవరిలో వేతన పెంపు జీవోను ప్రభుత్వం జారీ చేసింది. కానీ వేతనాలు మాత్రం పెరగలేదు. అధికారులను అడిగితే బడ్జెట్ కేటాయించ లేదని చెబుతున్నారని కార్మికులు వాపోతున్నారు.

**పెరుగుతున్న పని భారం**

జిల్లాలోని 540 ప్రభుత్వ పాఠశాలల్లో 35,015 మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతుండగా వారికి మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి 5.45 పైసలు, 9,10 తరగతుల వారికి ఒక్కొక్కరికి 8.17 పైసలు, ఒక కోడిగుడ్డుకు రూ.5 చొప్పున కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఓవైపు ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాల్సి ఉండగా ఆ ధరలను మాత్రం సవరించడం లేదు. కాగా మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేస్తూ వంటకార్మికులకు ఆర్థిక భారంతోపాటు పనిభారం పెంచుతోందనే విమర్శలున్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచి రాగి జావా కూడా విద్యార్థులకు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం కార్మికులకు ఎలాంటి హెల్పర్లను ఇవ్వకుండానే ఆ పని కూడా వారే చేయాలంటూ ఆదేశించింది. అయితే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రస్తుత బడ్జెట్‌ను సవరించాలని కార్మికులు కోరుతున్నారు.

**నెలల తరబడి బిల్లుల పెండింగ్**

ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన బియ్యం సరఫరా చేస్తున్నా హమాలీ చార్జీలు మధ్యాహ్న భోజన కార్మికులే భరిస్తున్నారు. మెస్ బిల్లులు మూడునాలుగు నెలలకోసారి ఇస్తుండడంతో కార్మికులు ఇంటి నుంచి పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. కాగా గత జనవరి నుంచి కార్మికులకు బిల్లులు చెల్లించలేదు. ఐదు నెలలుగా కోడిగుడ్ల బిల్లులు ఇవ్వలేదు. వెయ్యి రూపాయల గౌరవ వేతనం కూడా మూడునాలుగు నెలలకోసారి ఇస్తున్నారు. భోజనం వండేందుకు గ్యాస్ సరఫరా చేయాలని, మెస్ చార్జీలు కాకుండా వంట సరుకులు సరఫరా చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదు. కట్టెల పొయ్యిపైనే వంట చేయడం వల్ల కార్మికులు ఊపిరితిత్తులకు సంబంధించిన జబ్బుల బారిన పడాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

**జూలై 1 నుంచి సమ్మె**


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం పెంచుతామని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ చెప్పారని, అమలు చేయకుంటే ఈనెల 25న ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చి జూలై 1 నుంచి నుంచి సమ్మెలోకి వెళ్తామని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు ప్రకటించారు. పార్ట్ టైం కాకుండా ఫుల్ టైం మధ్యాహ్న భోజనం కార్మికులుగా గుర్తించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

**కనీస వేతనం రూ.10,500 ఇవ్వాలి**



20 ఏళ్లుగా పాఠశాలల విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నాం. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం సరిపోవడం లేదు. కనీస వేతనం నెలకు రూ.10,500 ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలి. 2022లో సీఎం కేసీఆర్ గౌరవ వేతనాన్ని రూ.3 వేలకు పెంచినా బడ్జెట్ కేటాయించక పోవడంతో ఇప్పటికీ నెలకు వెయ్యి రూపాయలు మాత్రమే ఇస్తున్నారు.
– పూసల రమేశ్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

**ప్రభుత్వమే సరుకులు సరఫరా చేయాలి**



ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో నిత్యావసర సరుకులు కొనలేకపోతున్నాం. ప్రభుత్వం చెల్లించే ధరలకు మార్కెట్‌లో సరుకులు రావడం లేదు. మేము ఇంటి నుంచి డబ్బులు కలిపి తీసుకురావాల్సి వస్తుంది. వంట చెరుకు కొనుగోలుకు ఇబ్బందిగా ఉంది. గ్యాస్, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలి.
– మల్లేశ్వరి, మధ్యాహ్న భోజన కార్మికురాలు, కాల్వ శ్రీరాంపూర్

## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి శివారు రంగంపల్లిలోని బీసీ వసతిగృహంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమేశ్ తెలిపారు. 3 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ప్రవేశం పొందేందుకు అర్హులన్నారు. హాస్టల్‌లో 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో బీసీలకు 38, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, ఇతరులకు 4 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యార్థులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు గతంలో ఉత్తీర్ణత సాధించిన స్టడీ సర్టిఫికెట్, టీసీ జిరాక్సు ప్రతులను దరఖాస్తుతో జతపర్చాలన్నారు. పూర్తి వివరాలకు 79894 54154, 70937 72827 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

**ఐటీఐలో ప్రవేశాలకు..**

**పెద్దపల్లిరూరల్:** ఐటీఐలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 19 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నర్సింహాచారి కోరారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు వీలైనన్ని ఎక్కువ ట్రేడుల్లో ఆప్షన్లు ఎంచుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**సివిల్ సర్వీసెస్ శిక్షణకు..**

**పెద్దపల్లిరూరల్:** సివిల్ సర్వీసెస్ శిక్షణ పొందాలనుకునే గిరిజనులు జూలై 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు (ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ)హాజరయ్యే గిరిజన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ అందించేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 62817 66534 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### 89 మంది ఎంపిక

**రామగుండం:** పట్టణంలోని ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ) ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు సోమవారం రామగుండం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో అప్రెంటిస్ మేళా జరిగింది. కేశోరాం సిమెంట్ (బసంత్‌నగర్), వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆదర్శ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాణే బ్రేక్ లైనింగ్ ఇండస్ట్రీ (హైదరాబాద్), ఎల్ అండ్‌టీ కంపెనీ (చెన్నై), ఐటీసీ ఫుడ్స్ (హైదరాబాద్) తదితర పరిశ్రమల ప్రతినిధులు మేళా నిర్వహించారు. ఇందులో వివిధ ట్రేడ్స్‌కు చెందిన 216 మంది విద్యార్థులు హాజరుకాగా 89 మంది ఎంపికైనట్లు రామగుండం ఐటీఐ ప్రిన్సిపాల్ సురేందర్, అప్రెంటిస్ అడ్వయిజర్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు.

### మెరిట్ తుది జాబితా విడుదల

**పెద్దపల్లిరూరల్:** డయాగ్నోస్టిక్ హబ్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తుది జాబితా రూపొందించి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో నోటీస్ బోర్డుపై అంటించామని జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి రూపొందించిన తుదిజాబితా వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం


దామోదర్‌రావును సన్మానిస్తున్న ఉద్యోగులు

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** తమిళనాడులోని హుసూర్ పట్టణంలో గౌరవ డాక్టరేట్ అందుకున్న సింగరేణి ఉద్యోగి జక్కుల దామోదర్‌రావును సోమవారం ఓసీపీ–1 బేస్ వర్క్‌షాప్ ఆవరణలో పీవో రాధాకృష్ణ, నాయకులు శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆర్జీ–3, ఏఎల్‌పీ టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతమ్ శంకరయ్య, ఓసీపీ–1 ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాస్, ఫిట్ సెక్రెటరీ మల్లయ్య, సునీల్‌ప్రసాద్, నజీర్ అహ్మద్, జీఎం కమిటీ సభ్యులు కిషన్‌రెడ్డి, పూర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కానిస్టేబుల్, మరో వ్యక్తిపై కేసు

**కమాన్‌పూర్(మంథని):** మండలంలోని మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో కానిస్టేబుల్, ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాలు.. రామగుండం కమిషనరేట్ పరిధి ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పోతుల అజయ్, గణేశ్ ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వస్తూ కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద సెంటనరీకాలనీకి చెందిన శనిగరపు సమ్మయ్య బైక్‌ను ఢీకొట్టాడు. అనంతరం ఇద్దరూ కలిసి సమ్మయ్యను చితకబాదారు. బాధితుడి కుమారుడు శనిగరపు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు అజయ్, గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ఎరువుల డీలర్లపై చర్యలు తీసుకోవాలి

**కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి):** ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన రైతు పత్తి లక్ష్మారెడ్డి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఎంఆర్‌పీ రూ.1,075 ఉండగా డీలర్లు రూ.1,700 చొప్పున విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించాడు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకుని సంబంధిత డీలర్లపై చర్యలకు ఆదేశించాలని రైతు విజ్ఞప్తి చేశాడు.

# అధికారుల తప్పిదం.. వికలాంగుడికి శాపం

- ఏడాదిగా పింఛన్ కోసం నరకయాతన


పోశమల్లు

**కోల్‌సిటీ(రామగుండం):** అధికారుల తప్పిదం.. ఓ వికలాంగుడికి సదరం సర్టిఫికెట్ అందని ద్రాక్షగా మారింది. రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ కాలును కోల్పోగా, మరో కాలుకు ఆపరేషన్ జరిగింది. ఇద్దరి సాయంలేనిదే కూర్చోలేడు, పడుకోలేడు. సదరం సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే, వైకల్యం కిందకి రాడంటూ అధికారులు రిజెక్ట్ చేశారు. దీంతో బాధితుడు సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చాడు. ‘సాక్షి’ బాధితున్ని పలుకరించగా తన గోడు వెల్లబోసుకున్నాడు.

**రెండేళ్లుగా ఇబ్బందులు**

రామగుండం కార్పొరేషన్ 33వ డివిజన్ విఠల్‌నగర్‌కు చెందిన మల్లారపు పోశమల్లు బొగ్గు లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. రెండేళ్ల క్రితం కొత్తగూడెం సమీపంలోని టేకులపల్లి ప్రాంతంలో లారీకి జరిగిన రోడ్డు ప్రమాదంలో పోశమల్లు తీవ్రంగా గాయపడ్డాడు. ఒక కాలు తొలగించిన వైద్యులు, మరో కాలుకు ఆపరేషన్ చేసి స్క్రూలు బిగించారు. ఒకవైపు ఇల్లు గడవక ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో రెండేళ్లుగా నరకయాతనకు గురవుతున్నాడు. ఆసరా పింఛన్ కోసం గతేడాది మార్చిలో సదరం క్యాంప్‌నకు స్లాట్ బుక్ చేసుకోవడానికి గోదావరిఖనిలోని ఓ మీసేవ కేంద్రంకు వెళ్లిన బాధితుడికి మీ సేవ నిర్వాహకుడి నిర్లక్ష్యపు పనికి సదరం సర్టిఫికెట్ రాలేదు. కాలు తొలగించారని దరఖాస్తులో పొందుపర్చకుండా, కంటిచూపు సమస్య ఉందంటూ తప్పుగా స్లాట్ బుక్ చేయంతో రిజెక్ట్ అయ్యింది. మీసేవా నిర్వాహకుడి నిర్వాకంపై కలెక్టర్ కార్యాలయానికి మూడుసార్లు ఫిర్యాదు చేస్తే, స్పందించిన ఉన్నతాధికారులు మరోసారి స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించారు.

**మరోసారి రిజెక్ట్..**

మరోసారి సదరం క్యాంప్ వెళ్లడానికి స్లాట్ బుక్ చేసుకున్న బాధితుడు, ఈ ఏడాది మార్చి 2న జిల్లా ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌కు అన్ని మెడికల్ రిపోర్టులతో హాజరయ్యాడు. ఇద్దరి సాయం లేనిదే కదల్లేని స్థితిలో ఉన్న ఈ బాధితుడు మాత్రం వైకల్యం కిందికి రాడంటూ రిజెక్ట్ చేశారు. దీనికి సంబంధించిన ఐడీ నంబర్ ఏఆర్ 21160332303020001తో అసెస్మెంట్ రిపోర్టును మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి పంపించారు.

సోమవారం విషయం తెలిసిన బాధితుడు తన భార్య, మరో బంధువు సాయంతో ట్రైసైకిల్ మీద నగరపాలక కార్యాలయానికి వచ్చాడు. తనకు పింఛను ఎందుకు మంజూరు కావడం లేదంటూ ఆవేదనతో నిలదీశాడు. వికలాంగుడిగా లేవంటూ సదరం సర్టిఫికెట్ రిజెక్ట్ అయ్యిందని, మరోసారి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సలహా ఇచ్చారు. దీంతో ఏం చేయాలో తోచక అక్కడే విలపించాడు. జిల్లా ఉన్నతాధికారులు తన పరిస్థితిపై స్పందించి ఇప్పటికైనా పింఛను మంజూరు చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

# కాంట్రాక్టు కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ

- డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్ మక్కాన్‌సింగ్


మాట్లాడుతున్న మక్కాన్ సింగ్

**జ్యోతినగర్(రామగుండం):** సమైక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. సోమవారం ఎన్టీపీసీ ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద కాంట్రాక్ట్ కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కులను యాజమాన్యం తుంగలో తొక్కి నియంతృత్వ నిర్ణయాలు తీసుకుంటూ, కార్మికులను, సంఘాల నాయకులను భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. యాజమాన్యం స్పందించి కార్మికులతో ఒప్పందం చేసుకున్న అగ్రిమెంట్లు వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ, ఒప్పందం కాలపరిమితి ముగిసి పది నెలలు గడిచిందని, కార్మిక సంఘాలతో 20 సార్లు చర్చలు జరిపినా ఫలితం లేదని ఆరోపించారు. చర్చలు ఇంకా ఆలస్యం చేస్తే కార్మికులు సమ్మె బాట పట్టక తప్పదని, సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవచూపాలని కోరారు. మహాధర్నాలో కౌశికహరి, ఫోరం నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, ఇజ్జగిరి భూమయ్య, రాజమల్లయ్య, సత్యం, శ్రీనివాస్, కొమురయ్య, ఐ.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**కళాకారులు మరింత అభివృద్ధి చెందాలి**

**గోదావరిఖనిటౌన్(రామగుండం):** రామగుండం పారిశ్రామిక ప్రాంత కళాకారులచే చిత్రీకరించిన బైరాన్‌పల్లి సినిమా ఘన విజయం సాధించాలని, ఈ ప్రాంత కళాకారులు మరింత అభివృద్ధి చెందాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక శ్రీనివాస థియేటర్‌లో ఇటీవల విడుదలైన బైరాన్‌పల్లి చిత్రాన్ని సోమవారం వీక్షించారు. అనంతరం కేక్ కట్‌చేసి కళాకారులకు అభినందనలు తెలిపారు. నాయకులు ఫక్రుద్దీన్, చిత్ర నటీనటులు దామెర రాజేష్, రహీం, వీహెచ్‌పీ నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



మాట్లాడుతున్న రాజేందర్

**గోదావరిఖని(రామగుండం):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం శివాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల నియోజకవర్గ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు, స్టిక్కర్లను పంచుతూ ప్రజలకు వివరించాలని సూచించారు. అసెంబ్లీ కన్వీనర్ పిడుగు కృష్ణ, నాయకులు సంపత్, సోమారపు లావణ్య, మాతంగి రేణుక, కామ విజయ్, మంచికట్ల బిక్షపతి, బద్రి దేవేందర్ పాల్గొన్నారు.

**కార్యకర్తలు ఉత్సాహంతో పనిచేయాలి**

**మంథని:** రాబోయే ఎన్నికల్లో మంథని నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంతో పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. సోమవారం మంథనిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు బీజేపీ గట్టి పోటీ ఇస్తుందన్నారు. మంథని ప్రాంత ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. చంద్రుపట్ల సునీల్ రెడ్డి, మల్క మోహన్‌రావు, నాంపల్లి రమేశ్, వీరబోయిన రాజేందర్, తోట మధుకర్, ఎడ్ల సదాశివ్, పోతరవేణి క్రాంతి కుమార్, సబ్బని సంతోష్, కొండపాక సత్యప్రకాష్, బోగోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏం సాధించారని సంబరాలు

- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**విద్యానగర్(కరీంనగర్):** ప్రజలను మభ్యపెడుతూ సంబరాలు చేయడం కాదని, వాస్తవాలకు అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన దశాబ్దంలో దొర కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. చదువుకున్నోడికి నౌకరీ లేదు, చదువులేనోడికి కులవృత్తిలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో రూ.60వేల కోట్ల అప్పు ఉంటే.. ఇప్పుడు రూ.5,60,000 కోట్లకు చేరిందన్నారు. ధర్మారం మండలం స్తంభంపల్లిలో విత్తనాలు ఫ్యాక్టరీ ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలతో ఆడుకోవడం మాని రైతుల కోసం చక్కెర ఫ్యాక్టరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇథనాలు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో ప్రతి క్వింటాల్‌కు తరుగు పేరున 5కిలోలు ఎక్కువ తూకంవేయడంతో రైతులు క్వింటాకు రూ.100 నష్టపోతున్నారని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటివరకు డబ్బులు ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఇద్దరు సంక్షేమశాఖల మంత్రులున్నప్పటికి జిల్లా ప్రజలకు జరిగిన మేలు ఏమిలేదన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ఆర్భాటాలు చేయడం ఆశ్చర్యకరంగా ఉందని, ఉద్యమ ఆకాంక్షలు ఏం నెరవేరాయో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గానికి వందమంది చొప్పున దళితబంధుకు రూ.15.700 కోట్ల బడ్జెట్ శాసనసభలో ఆమోదం పొందినా.. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. నాయకులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- ఆర్జీ–2 జీఎం మనోహర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీఎం మనోహర్

**గోదావరిఖని(రామగుండం):** సింగరేణి అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. సోమవారం అలీప్ (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రిప్యూనర్స్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఉచిత జ్యూట్ బ్యాగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏరియాలోని ప్రభావిత గ్రామాలైన పెంచికల్‌పేట్, న్యూమారేడుపాక, అల్లూరు, వెంకట్రావ్‌పల్లి, కేకేనగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాలకు చెందిన మహిళలకు అలీప్‌కు చెందిన ప్రతినిధులు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్స్ అందజేస్తారన్నారు. తయారు చేసిన ఉత్పత్తులను ఎగుమతులు చేయాల్సి అంశాలపై తర్ఫీదు ఇస్తారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు పరిసర, ప్రభావిత గ్రామాలకు మౌలిక సదుపాయాల కోసం కృషి చేస్తోందన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో వకీల్‌పల్లిగని రెమేడియేషన్ పథకం కింద శిక్షణ ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. ఈశిక్షణ ద్వారా నేర్చుకున్న విద్యలో నైపుణ్యత సంపాదించుకుని పరిశ్రమలను స్థాపించి ఉపాధి పొందే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికారుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, పర్యావరణ అధికారి సురేష్‌బాబు పాల్గొన్నారు.

# బియ్యం తెచ్చేందుకు వెళ్తూ..

- మూలమలుపు వద్ద అదుపు తప్పిన ద్విచక్రవాహనం
- ఒకరి మృతి, మరొకరికి గాయాలు


మహేశ్(ఫైల్)

**మంథని:** మిత్రులతో క్రికెట్ ఆడుతుండగా.. రైస్ మిల్లుకు వెళ్లి బియ్యం బస్తా తీసుకురావాలని తల్లి పురమాయించడంతో, స్నేహితుడితో ద్విచక్రవాహనంపై వెళ్తూ.. ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని నాగారం శివారులో జరిగింది. ఎస్సై వెంకటేశ్వర్లు, స్థానికుల వివరాలు.. మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన వేముల సమ్మయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. సమ్మయ్య అనారోగ్యంతో మృతిచెందగా, భార్య శ్యామల కూలీ పని చేస్తూ కుటుంబాన్ని సాకుతుంది. ఆమె కొడుకు వేముల మహేశ్(24) సోమవారం క్రికెట్ ఆడుకుంటుండగా బియ్యం తీసుకురావాలని తల్లి చెప్పడంతో అదే గ్రామానికి చెందిన గుర్రాల వంశీతో కలిసి మండలంలోని కన్నాల రైస్ మిల్లుకు బయలుదేరారు. నాగారం శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. మహేశ్‌కు తీవ్ర గాయాలైనాయి. మంథని సామాజిక వైద్యశాలకు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వంశీకి ప్రథమ చికిత్స అందించి గోదావరిఖనికి తరలించారు. కాగా మహేశ్ మంచిర్యాల జిల్లా జైపూర్ విద్యుత్ ప్లాంట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.